"కళావరు రాజు వేశానండీ!"

పేకముక్కలు పదమూడూ పట్టుకుని వాటిలోకి తదేకంగా చూస్తున్న నన్ను హెచ్చరించాడు రమణమూర్తి.

"ఏమిటి గురువుగారూ అంత ఆలోచనలో పడ్డారు....? కొంపదీసి దాంతో 'షో' చెయ్యటం లేదుకదా! కాస్తంత నా పేక బ్రతక నివ్వండి". అంటూ ఓ సిగరెట్టు తీసి వెలిగించు కున్నాడు రాఘవరావు.

"అంత త్వరగా ఎక్క దవుతుంది లేవయ్యా! ఇంకా రెండో రౌండేగా ?"

"షో!" వేస్ట్ కార్డ్ మూసేసి పదమూడు ముక్కలూ క్రిందపరచాను.

తన పాయింట్సు లెక్కపెట్టి – రెండు రూపాయలుతీసియిచ్చాడు రమణమూర్తి.

"నాది ఫుల్ కౌంటండీ!" అంటూ తన లాల్చీ జేబులోంచి పది రూపాయల కాగితంతీసి నా ముందువేశారు తాతగారు.

ఆయన యిచ్చిన పదిరూపాయల కాగితాన్ని జేబులో పెట్టుకుంటూ ఓసారి రోడ్డు మీదకు చూశాను. పరిస్థితి మామూలుగానే వుంది. ఇంకా 'రిలీవింగ్ బస్' వచ్చినట్టు లేదు.

## జీడిగుంట రామచంద్రమూర్తి

# 'షో'

ధీమాగా అన్నాడు తాతగారు.

ఓ పక్క వాళ్ళమాటలు వింటూనే నేను ఆలోచిస్తున్నాను. 'రమణమూర్తి వేసిన కళావరాసు తీసుకోవాలా వద్దా?' అని! అదితీసుకుంటే పన్నెండు ముక్కలు పండిపోతాయి. ఒకవేళ దాన్నికాదని పేకలోకి వెడితే ఏ జోకరో—ఇస్పేటు తొమ్మిదో వచ్చిందంటే 'షో' చేసేయవచ్చు....

ఏమయితే అయిందని పేకలోంచి ముక్కతీశాను.

జోకరు!

మేం నలుగురం హైదరాబాద్ బస్‌లో ప్రయాణం చేస్తున్నాం. దారిలో ఇంజన్ చెడిపోయి బస్ ఆగిపోయింది.

మరో 'రిలీవింగ్ బస్' వచ్చేదాక మాకు మోక్షం లేదని చెప్పాడు కండక్టరు అక్కడకు సుమారు నలభై మైళ్ళ దూరంలో వున్న డిపోకు కబురు అంది, అక్కడనుంచి మరో 'స్పేర్ బస్' రావటానికి కనీసం నాలుగు గంటలయినా పడుతుంది....

అంత ఎండలో-పిల్లలతో ప్రయాణం చేస్తున్న ఒకరిద్దరు ప్రయాణీకులు మహా

చిరాకు పడిపోయారు .... 'ప్రయివేటు బస్సులే నయమని' ఒకరంటే-"బయ లేరేటపుడు అన్నీసరిగ్గా వున్నాయో లేదో చూసుకోవద్దూ"-అంటూ ఒకరూ-అంద రికీ వినబడేలా - విసుక్కు-న్నారు.

అంతకుముందే నాతో పరిచయం చేసుకున్న రాఘవరావు 'గురువుగారూ! తమరికి చతుర్ముఖ పారాయణంలో ప్రవేశం ఏమైనా వుందా?' అని అడి గాడు నవ్వుతూ....

'రమ్మీ అయితే రడీ!' అన్నాను నేనుకూడా బదులుగా నవ్వి....

"బొత్తిగా ముగ్గురమే అయితే ఏం బాగుంటుందీ? నలుగురయినా లేనిదే ఆట రక్తికట్టదు! అసలు అందుకే దీన్ని చతుర్ముఖ పారాయణం అన్నారు — అన్నాడు మా ప్రక్క-నే వున్న రమణమూర్తి అంతవరకూ చదువు తున్న 'వీక్లీ' మూసేస్తూ....

మాకు ముందు సీటులో కూర్చున్న తాతగారు మా సంభాషణ అంతా విని- 'నాలుగో వాడ్ని నేను వస్తాను పదండి'- అంటూ లేచారు.

'రిలీవింగ్ బస్' రాగానే హారన్ కొట్టమని డ్రైవరుకూ, కండక్టరుకూ చెప్పి - అక్క-డకు పాతికడుగుల దూరంలో వున్న మామిడి తోటలో కూర్చుని పేకాట ప్రారంభించాం.

రాఘవరావూ,రమణమూర్తీ మెడిసిన్ ఫైనలియర్ చదువుతున్నారు. వాళ్ళ 'రూంమేట్' పెళ్ళికి వెడుతున్నారట.... ఎందుకైనా వుంటాయని- వాళ్ళే రెండు కొత్త పేకలు తెచ్చారు. మా కాలక్షేపా నికి అవసర మయ్యాయి.

అంతవరకూ లెఖ్ఖలు కట్టిన రాఘవ రావు- "గురువుగారూ! నావి అరవై రెండు పాయింట్సండీ." - అని ఆరు రూపాయలు తీసి యిచ్చాడు....

"ఒరేయ్! సరిగ్గా కౌంట్ చేయరా ఫూల్!" అని నవ్వుతూనే రాఘవ రావును చీవాట్లువేసి - 'ఆల్‌కవుంట్ అయినపుడు, తనముక్కల్ని పేకలో కలిపేసి - తక్కువ పాయింట్స్ చెప్ప టం మా వాడికి హాబీ... కాస్తజాగ్రత్తగా చూసుకుని మరీ ఆడండి"— అన్నాడు రమణమూర్తి నాతో....

నాకూ నవ్వొచ్చింది....

"ఏడిశావ్ లేవోయ్!.... అంత నీతి మాలిన పనులు చేయవలసిన అవసరం నాకేం లేదు!"— అన్నాడు రాఘవరావు ముక్కలు పంచుతూ....

తాతగారు చిన్నగా నవ్వేరు!.... వయసు ముదిరినా — ఆయన అలా నవ్వుతూంటే ఎంతో హుందాగా కని పించారు.

"ఏదో మీలో మీరే నవ్వుకుంటు న్నారు! మాకూ ఓ 'ఛాన్సివ్వండిసార్.... అసలే ప్రొద్దుట నుంచీ బస్సులో కూర్చో లేక విసుగెత్తిపోయున్నాం".... అన్నాడు రమణమూర్తి జోక్‌గా....

"మరేం లేదు! మీ మిత్రుడు 'నీతి మాలిన పనులు' అని అంటూంటే నవ్వొచ్చింది... నిజం చెప్పాలంటే నీతికి నిలబడి ధర్మపథంలో నడిస్తే ఎవరూ ముందుకు రాలేరోయ్.... అడ్డదారులు త్రొక్కి-నపుడూ — అధర్మానికి వెరవ నప్పుడూ-ఎవరైనా పైకి రాగలుగుతారు" —అంటూ లాల్చీ జేబులోంచి సిగరెట్

పెట్టె తీసి_ఒక సిగరెట్టు ముట్టించి_ నాకూ ఒకటి 'ఆఫర్' చేశారు ఆయన....

"ఇంతకీ మీకు నీతినియమాల మీదా_ న్యాయం, ధర్మం మీదా నమ్మకం లేదనుకొంటాను....పోనీ దేవుడి మీదయినా నమ్మకం వుందా లేక కొంపదీసి నాస్తికవాదులా ?"—అన్నాడు రాఘవరావు 'జోకర్' కట్ చేసి క్రిందపెడుతూ....

"నాట్ ఎగ్జాక్లీ ! అయినా ఎవరో దేవుడనేవాడు ఎక్కడో నిక్కి కూర్చుని — ఒళ్ళంతా కళ్ళుచేసుకొని — ఇక వేరే పనేమీ లేనట్లు_మనందరి తప్పులూ లెఖ్ఖ పెడుతూంటాడనే విషయాన్ని నమ్మకూడదంటాను....ఒకచోటకు వెళ్ళవలసి వచ్చినప్పుడు దానికి రాజమార్గం కాకుండా వేరే అడ్డదారి వున్నప్పుడు ఆ అడ్డదారినే వెళ్ళి గమ్యాన్ని చేరుకుంటాం .... ఎందుకూ ? .... ఏమో ? చెప్పలేం ! .... అదే విధంగా మన అవసరం తీర్చుకోవటం కోసం మనం అభివృద్ధిలోకి రావటం కోసం — అవసరమయితే అడ్డదారులు తొక్కాలి !...."— పేకముక్కలు చేతిలో పేర్చుకుంటూ అన్నారు తాతగారు.

"మీరు ఎన్నైనా చెప్పండి ! నీతిమాలిన పనులుచేసి వెనుకనుంచి గోతులు తీసే ఆషాఢభూతులెవరూ మంచి భవిష్యత్తును పొందలేరు సార్" —అన్నాడు రాఘవరావు.

తాత గారు మళ్ళీ నవ్వేరు .... సగం వరకూ కాలిన సిగరెట్టును నలిపి దూరంగా విసిరేశారు.

"నీ పేరేమిటో గుర్తు లేదు కానీ నువ్వింక చిన్నవాడివోయ్ .... లోకం పోకడ బొత్తిగా తెలియని వాడివి.... ఈ కలియుగంలో ఇంకా నీతి — నిజాయితీ — న్యాయం ధర్మం అంటూ మడిగట్టుకుని ఎవరూ కూర్చోలేదు....ఉదాహరణకు ఈ డాక్టరుగార్ని చూడండి. పేషెంటు వచ్చి పరీక్ష చేయమంటే — ఏమీ లేకపోయినా — ఏదో వుందని హంగామా చేసి, రూపాయికి పది రూపాయలు బిల్లు చేస్తారు" — అని నవ్వుతూనే నన్ను చూసి — "ఎక్స్‌క్యూజ్ మీ! డాక్టరంటే కేవలం మిమ్మల్ని తీసుకుని ఈ అభిప్రాయం చెప్పలేదు, 'జనరలైజ్' చేసి చెప్పాను. అంతే!—అయినా మనుషుల్లో కూడా మాణిక్యాలు లేకపోలేదు.... కానీ అవి కేవలం మరుగునపడిన మాణిక్యాలుగానే వుండిపోతాయి....వెలుగులోకి రాలేవు ! అందుకే నీతి నియమాలమీద నమ్మకం పెట్టుకోవద్దంటున్నాను .... మీకు వినే ఓపికవుంటే,మరో కథలాంటి ఉదాహరణ కూడా చెప్తాను"—అన్నారు ఆయన.

"చెప్పండిసార్! కథలంటే మా రమణకి ప్రాణం....మంచి కథ దొరికితే — కొంచెం 'మసాలా' కలిపి — పిక్చర్ తీయాలనుకుంటున్నాడు"—అంటూ — పేక ముక్కలన్నీ తీసి పెట్టెలో పెట్టేశాడు రాఘవరావు.

"ఇంతకీ మన బస్ సంగతి ఏమయిందో ?"— అన్నారు తాతగారు మళ్ళీ మరో సిగరెట్ వెలిగించుకుంటూ.

"స్పేర్ బస్ రాగానే మనల్ని పిలవమని కండక్టర్‌కు చెప్పానుగా. అయినా మనకు రోడ్డు కనిపిస్తూనే వుంది. మీరు కథ కానీయండి సార్" అని సర్దుకుంటూ

కూర్చున్నాడు రమణమూర్తి.

"చెప్పండి సార్ .... కాలక్షేపమయి పోతుంది." నేను కూడా ఆయనకు దగ్గరగా జరిగి కూర్చుంటూ అన్నాను.

"అయితే వినండి ! అనగనగా—అంటే సుమారు పదిహేనేళ్ళ క్రితం—ఓ జిల్లాలో ఓ 'డియ్యీఓ'గారు వుండేవారు. ఆయన తాలూకు బంధువర్గం – రాజకీయపరంగా ప్రాముఖ్యత వహించినవారు కావటంవల్ల, – చిన్నవయస్సులోనే అంత పెద్ద పదవి పొంద గలిగారు. ఆయన మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చినవారే అయినా – తమకు అదృష్టవశాత్తూ వచ్చిన అధికారాన్ని వినియోగపరచుకుని – ఉన్నత కుటుంబీకులవ్వాలని నిర్ణయించుకున్నారు"

"ఇక ఆఫీసులో ఆయనగారి మాట వేదాక్షరం. బయట ఆయన అడుగులకు పంతుళ్ళంతా మడుగులొత్తేవారు. స్కూలు ఇనస్పెక్షన్‌కు వెడితే దారిపొడుగునా మల్లెపూలు పోసేవారు .... ఇక ప్రయివేటు స్కూళ్ళ విషయం చెప్పనవసరమే లేదు!....ఆయనగారికి అక్కడ వున్నన్నాళ్ళూ మనుగుడుపులే!....

".... అయ్యగారి దర్శనం కనీసం అరడజనుసార్లు చేసుకున్నా అవసరాలు తీరేవికావు .... స్కూలులో పాఠాలు సరిగ్గా చెప్పినా చెప్పకపోయినా – బడి సక్రమంగా నడిచినా నడవకపోయినా— ఇనస్పెక్షన్‌కు వెళ్ళినపుడు ఆయనకు మర్యాదలూ మన్ననలూ మంచిగాజరిగితే ఆ స్కూలు బ్రహ్మాండంగా వుందని 'రిమార్కు' రాసేవారు....

"........ ఆయన ఆ జిల్లాకి వచ్చిన కొత్తలో, ఆయనగారి అలవాట్లూ పడికట్లూ చూసి హెడ్‌మాస్టర్లు కొందరు భయపడినా రానురాను – తమతమ పనులను ఎలా చక్కబెట్టుకోవాలో — తమ తమ అవసరాలు ఎలా తీర్చుకోవాలో తెలుసుకొన్నారు. ఒకవేళ ఎవరికైనా ఆయనవల్ల ఇబ్బంది కలిగి పై అధికారులకు 'పిటీషన్' పంపకుంటే ఆవిషయం కూడా ఆయనకు తెలిసిపోయేది....అందుకనే ఆయన రాజ్యంలో అందరూ సర్దుకుపోవటం అలవరచుకున్నారు........

"....ఏదైనా ముఖ్యమైన విషయం గురించి—ఆఫీసులో గుమాస్తాలు 'నోట్' పెడితే—దానిమీద 'ఆర్డరు' ఒక పట్టాన పడేవికావు. అంతపొడుగు ఆఫీసునోటు మీదా—

"టూ లై ఓవర్" (కొన్నాళ్ళుండనీయ్) అనో 'ఇన్ పర్సన్'(స్వయంగా వచ్చి విషయం చెప్పు) అనో 'ఎంక్వైరీ' వేసి గుమాస్తాలకు తిప్పి పంపేసేవారు ; కానీ సదరు విషయానికి సంబంధించిన వ్యక్తులు వచ్చి—ఆయనగార్ని దర్శించుకున్నపుడు మాత్రం—ఆయనే గుమాస్తాని పిలిచి .... అర్జంటుగా ఆ కాగితాలను తీయించి 'ఆర్డరు' పెట్టమనేవారు! .... అక్కడికి గుమాస్తాయే అంతవరకూ ఆలస్యం చేసినట్టూ __ ఆయన ఏదో సహాయం చేసినట్టూ!...."తాతగారు రెండు క్షణాలు చెప్పటం ఆపి—సగంకాలిన సిగరెట్టును నేలమీద నలిపి— ఒకసారి కారు నిలబడివున్న రోడ్డుమీదకు చూసి మళ్ళీ చెప్పటం ప్రారంభించారు ;

"........ఒకసారి ఆయన ఒక ఊరి స్కూలు 'ఇనస్పెక్షన్' కోసం వెళ్ళి అక్కడి ట్రావెలర్స్ బంగళాలో మకాం

చేశారు. ఆ ఊరిలోని ప్రముఖులూ — ఇతర ఉపాధ్యాయవర్గమూ ఆయనను దర్శించుకుని తమ తమ అవసరాలూ - కష్టసుఖాలూ చెప్పుకొన్నారు.... ఆ సమయంలోనే అక్కడకు వచ్చింది సుశీల! ఆమె అక్కడి స్కూలులో రెండు సంవత్సరాలుగా పని చేస్తోంది. 'హిందీ పండిట్'గా... రాగానే భయభక్తులతో నిలబడి రెండుచేతులూ జోడించి ఆయనగారికి నమస్కరించింది....

....'ఏమిటిలా వచ్చావ్' — అన్నట్లుగా ఆమెవైపు చూశారాయన....

"....నాకు మా ఊరికి 'ట్రాన్స్‌ఫర్' కావాలని చాలాకాలంగా దరఖాస్తులు పెట్టుకొంటున్నాను. అక్కడ మా అమ్మగారికి నా సహాయ సహకారాలు ఎంతైనా అవసరం...." అంటూ తన కష్టసుఖాలు చెప్పుకొంది. తనకు గత రెండు సంవత్సరాలుగా 'ఇంక్రిమెంట్లు' రావటం లేదని కూడా మొరపెట్టుకొంది ...ఆవిడ చెప్పిందంతా సావధానంగా విని మళ్ళీ మరో దరఖాస్తు రాసి తీసుకరమ్మన్నారు. ఆయన....ఆ ప్రకారమే మళ్ళీ ఒక దరఖాస్తును వ్రాసి వేయించి సాయంత్రం ఆయన దగ్గరకు వచ్చింది సుశీల....

'కూర్చో' ఆమె రాగానే తనకు ఎదురుగా వున్న కుర్చీ చూపించారు డియ్యీఓగారు.

"ఫరావాలేదండీ" - ఒదిగి ఒదిగి నిలబడింది ఆమె.

"తప్పు లేదులే కూర్చో" - అంటూ విచిత్రంగా నవ్వారు ఆయన. బిడియపడుతూనే కూర్చుంది సుశీల.... నౌకరు వచ్చి రెండు గ్లాసులతో పళ్ళరసం అక్కడ పెట్టాడు.

ఊళ్ళోకి వెళ్ళి సిగరెట్లు తెమ్మని అతనికి ఆదేశం ఇవ్వటంతో- నౌకరు వెళ్ళిపోయాడు.

"అయితే నీకు వెంటనే ట్రాన్స్‌ఫర్ కావాలంటావ్. అంతేకదూ" - అన్నారు ఆయన పళ్ళరసం తీసుకుంటూ.

ఆమె ఎందుకో భయపడుతూన్నా- ఆశతో ఆయనవైపు చూసి తల ఊపింది ఔనన్నట్లుగా."....

"ఆమె వయస్సు ఎంతుంటుంది సార్"- అని ప్రశ్నించాడు రమణమూర్తి అతని ప్రశ్నకు నేనూ తాతగారూ కూడా నవ్వుకున్నాం.

"ఒహో! చెప్పటం మరచాను కదూ! ఆమెకు పాతిక వుంటే ముప్పైలోపే వుండవచ్చు. కారణాలు మనకి తెలియవు కానీ ఆమెకు అప్పటికింకా పెళ్ళికాలేదు. అప్సరస కాకపోయినా అందచందాలకు తక్కువేంకాదు"— అన్నారు తాతగారు.

"సరే! కంటిన్యూ చెయ్యండిసార్!" అన్నాడు రమణమూర్తి ఆయనకు మరింత దగ్గరగా జరిగి కూర్చుని.

"కంటిన్యూ చెయ్యడానికి ఏముంది ? ట్రాన్స్‌ఫర్ చేస్తాననీ, ఇంక్రిమెంట్లు ఇప్పిస్తాననీ ఆశపెట్టి సదరు సుశీలగారి శీలాన్ని కాస్తా హరించి వుంటాడు"— అన్నాడు రాఘవరావు కథ అయిపోయిందన్నట్లుగా

"సరిగ్గా అదే జరిగింది! ఆమె వద్దని వారిస్తున్నా—తప్పించుకోవాలని ప్రయత్నించినా ఆయన వినలేదు .... పళ్ళరసంతో కలిపిన 'మందు' అలవాటయిన

ఆయనగారి మీదకంటే—అలవాటులేని ఆమెమీద త్వరగా పనిచేసింది. అందుకే ఆయన ముందు పూర్తిగా ఓడిపోయింది ఆమె.

"పోనీ తర్వాతయినా ఆమెకు ట్రాన్స్ఫర్ వచ్చిందాసార్?" రమణమూర్తి ప్రశ్న....

"వచ్చింది .... కానీ ఆమె కోరిన వూరికి మాత్రం కాదు, ఆ 'డియ్యీఓ' గారు పని చేస్తున్న వూరికి!" -అంటూ భావగర్భితంగా నవ్వేరు.

"........ కానీ విచిత్రమేమిటంటే శీలమూ సత్ప్రవర్తనా లేని ఆయనగారు ఎందరికో - వాళ్ళ శీలమూ ప్రవర్తనా మంచివని, 'కాండక్టు సర్టిఫికెట్సు' - రాసిచ్చేవారు.

"........ఒక ఊరిలో కొత్త స్కూలు పెట్టేటప్పుడూ - మరో స్కూలులో కొత్త పోస్టులు ఇచ్చేటప్పుడూ - ఆయనకు ఎన్నో కానుకలు వచ్చేవి .... ఆయన ఎవరివద్దా ఒక్క నయాపైసా లంచం పుచ్చుకుని ఎరుగరు .... అయితేనేం - కానుకలూ బహుమతులూ వస్తే వద్దని వారించేవారు కూడా కాదు. ఒకళ్ళు కందుల బస్తా పంపిస్తే మరొకరు చింత పండు బుట్ట వేయించేవారు. ఏజెన్సీలోని ఒక హెడ్మాష్టరు దజను బొగ్గుల బస్తాలు వేయించగా—మరో ప్రయివేటుస్కూలుమేనేజరు - ఒక లారీతో కలపతోలించేవాడు.... ఇలా ఆయనగారి దివాణంలోకి ప్రతిరోజూ ఏదో బహుమతి వస్తూనే వుండేది,

"........ఆయన గారి ఆఫీసులోనే 'మూర్తి' అనే గుమాస్తా ఒకడుండే, వాడు ....అతను వేళకు వచ్చి, తనపనేదో తాను చేసుకుని మళ్ళీ ఐదుగంటలు కాగానేవెళ్ళిపోయేవాడు.... పనులన్నీ రూలు ప్రకారమే చేసేవాడు.

"....ఒకసారి ఆ జిల్లాకు కొన్ని కొత్త టీచరు పోస్టులు శాంక్షన్ అయాయి. వాటిని ఏఏ స్కూళ్ళకు ఇవ్వాలో ఆలోచించి ఆర్డరు వేయాలనీ - అందుకోసం, ఆదివారం రోజున దానికి సంబంధించిన ఫైలు తీసుకుని ఇంటికి రావలసిందిగా అతనికి 'నోట్' పంపించారు ఆయన.

....దాన్ని చూసుకుని —ఇంటికి రావలసిన అవసరం తనకులేదనీ-స్కూళ్ళ నుంచి వచ్చిన దరఖాస్తులన్నీ పరిశీలించి- ఏ ఏ స్కూళ్ళకు ఎక్కువ అవసరమో- వాటిపేర్లు వరసక్రమంలో రాసి 'ఆఫీస్ నోట్' పెడతాననీ ఆ కాగితం మీదనే జవాబు రాసి, దాన్ని తిరిగి ఆయనకు పంపించాడు.

....ఈ విధంగా తనకు 'ఇంట్రస్టు' వున్న విషయాలలో అడ్డు తగులుతున్నాడనే ఉద్దేశ్యంతో అతనిమీద పగబట్టి సాధించాలనుకున్నారు ఆ 'డియ్యీఓ' గారు.

....రాజుగారు తలుచుకుంటే దెబ్బలకు కొదువ ఏముంటుంది?

....ప్రతిపనికీ లంచం తీసుకొంటున్నట్లు — నలుగురయిదుగురు హెడ్ మాస్టర్లచేత, అతనిమీద పిటీషన్లు పెట్టించారు. ఆయన....ఆయనే ఎంక్వయిరీ చేశారు. అధికారులకు రిపోర్టు పంపించారు. అతన్ని సస్పెండ్ చేయించటానికి, ఆయనగారికి అయిదు రోజులు కూడా పట్టలేదు....

"....ఇలా తనకు అడ్డు వచ్చినవారిని, తన దారినుంచి తొలగించుకుంటూ – సుఖ సంతోషాలు అనుభవిస్తూ – పై వర్గంలో వున్న పెద్దల సహాయంతో – అదేజిల్లాలో ఎన్నో సంవత్సరాలు ఏకచ్ఛత్రాధిపతిగా పనిచేసి 'రిటైర్' అయ్యేనాటికి రెండు లక్షలు విలువచేసే ఆస్తిని వెనకేశారు.... 'రిటైర్' అయినా విలాసపురుషు డని పించుకుంటున్నారు....

".... అదేకనుక, నీతినియమాలనీ, పాపపుణ్యాలనీ పట్టుకుని ప్రాకులాడితే ఆయన అంత డబ్బు గడించేవారా?...." అంటూ చెప్పటం ముగించి నావైపు చూశారు....


"ఇంతకీ ఈ కధంతా మీరుస్వయంగా చూసినట్లు చెప్పేశారు....నిజంగా జరిగిందంటారా? .... లేకపోతే కాలక్షేపానికి చెప్పేరా"–అన్నాడు రమణమూర్తి....

ఆయన మరో సిగరెట్టు తీసి ముట్టించి గట్టిగా దమ్ములాగి, పొగపైకి వదులుతూ "నిజంగా జరిగిందే! ఆ 'డియ్యోటి' ఎవరో కాదు నేనే" అన్నారు.

రమణమూర్తి – రాఘవరావుల కంటే ఎక్కువగా నేనే ఆశ్చర్యపోయాను. రెండు నిమిషాల నిశ్శబ్దంతరువాత ఆయనే మళ్ళీ అన్నారు –

"కానీ – నాకు అప్పుడప్పు డనిపిస్తూ వుంటుంది....అన్ని చెడ్డపనులు చేసి ఈ డబ్బు సంపాదించకపోతేమాత్రం బ్రతక లేమా అని! నేను మొదటిసారి సుశీలను బలవంతం చేసినపుడు– ఆమె తన రెండు చేతులూ జోడించి– 'నేను మీకు చెల్లెలు వంటిదాన్ని' అని మొరపెట్టుకున్నప్పుడు నాలోని మానవత్వం ఏమయిపోయిందా అని ఇప్పు డనిపిస్తుంది. ఆ రోజు మా ఆఫీసు గుమాస్తా మూర్తిని ఉద్యోగం నుంచి సస్పెండ్ చేసినప్పుడు–అతను నా దగ్గరకు వచ్చి–దీనంగా చూస్తూ–'వస్తాను సార్'–అని వెళ్ళిపోయిన దృశ్యం తలచుకుంటే ఇప్పటికీ నా గుండెల్ని ఎవరో పిండుతున్నట్లుంటుంది....ఎవరో హత్య చేసినట్లు ఫీలవుతూంటాను" – అన్నారు ఆయన బాధగా.

"అదే అందులో వున్న విశేషం.... నీతికీ, ధర్మానికీ కట్టుబడి దైవాన్నినమ్ము కొన్న ఏ వ్యక్తీ అంతటి పాపకార్యాలు చేయలేడు. తన సుఖం కోసం మరొకరి జీవితాన్ని బలి తీసుకోడు .... ఐహిక సుఖాల కోసం ఆరాటపడి – అడ్డదారులు



త్రొక్కి—ననాడు మానసిక శాంతి కరువయి తీరుతుంది—" అన్నాను నేను. ఆయన మరేమీ బదులు చెప్పకుండా రెండు క్షణాలు కళ్ళు మూసుకొన్నారు.

మళ్ళీ అన్నాను—

"మీరు అంత బాధపడవలసిన అవసరంలేదు। ఏది చేసినా—మరేం జరిగినా—అంతా మంచికే నన్నట్లు — మీ రానాడు మూర్తిని 'సస్పెండ్' చేయటం కూడా అతని మంచికే జరిగింది"—అని।

మూసిన కళ్ళు తెరచి—ఆయన నావైపు నిశితంగా చూశారు.

"మీకు అతను తెలుసా?" అని అడిగారు.

"ఆ....తెలుసు।....అతన్ని ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయగానే, అంతకు ముందే తప్పిన బి. ఏ. పరీక్షకు ప్రయివేటుగాకట్టి, ప్యాసయి. తరువాత వాళ్ళ మేనమామ సహాయంతో యూనివర్శిటీలో చేరాడు .... "ఎమ్మే" ఫస్ట్ క్లాస్‌లో ప్యాసయి ఇపుడు ఎకనామిక్సు లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు"—అన్నాడు.

"ఇదేదో సస్పెన్స్ పిక్చర్‌లా కన్పిస్తోంది. ఇంతకీ ఆయనగారు సస్పెండ్

చేసిన మూర్తి ఎవరో మీకెలా తెలుసు గురువుగారూ ?" — అని అడిగాడు రాఘవరావు.

"వాడు మా అబ్బాయి" — నేనింకా పూర్తిగా చెప్పకుండానే తాతగారు ఒక్క-సారిగా నా రెండుచేతులు పట్టుకొని-

"మీరు నన్ను క్షమించాలి ! ఆనాడు మీ అబ్బాయికి చేసిన అన్యాయానికి ఈ నాడు మీరు మనస్ఫూర్తిగా క్షమించా నంటే నాకు మనశ్శాంతి లభిస్తుంది !"- అంటూ ప్రాధేయపూర్వకంగా చూశారు.

"ఇందులో క్షమించడానికి ఏముం దండీ ? అంతా దైవలీల ! మీరు ఆ నాడు వాడ్ని ఏదో వంకతో ఉద్యోగం తొలగించి వుండకపోతే, ఆ గుమాస్తా గిరిలోనే కొట్టుకుంటూండేవాడు. అలా జరగబట్టే ఈ నాడు మంచిస్థితికి రాగలి గాడు !...." అని నేను అంటూండగా మాకు బస్ హారన్ వినిపించింది.

మేం లేచి రోడ్డు మీదకు నడిచాం....

"ఇంతకీ ఆ సుశీలమ్మగారి సంగతి మీరు చెప్పనేలేదు !.... ఆవిడ ఇపుడు ఎక్కడున్నారుసార్ ?"— అని ప్రశ్నిం చాడు రమణమూర్తి దారిలో....

"షో' చెయ్యటానికి జోకరును వాడు కున్నట్లు — అవసరానికి ఆ సుశీలమ్మ గార్ని వాడుకుని వుంటారు....ఒకాటలో వచ్చే జోకరు మరో ఆటలో కూడా రావాలని ఎక్కడుంది?"— అన్నాడు రాఘవరావు వ్యంగ్యంగా....

"నో! మీరు పొరపాటు బడుతు న్నారు! .... ముందు ఎలాంటి వృద్ధ శ్యంతో తప్పటడుగు వేసినా - తరువాత తప్పించుకోలేకపోయాను! నా మొదటి భార్య పోయిం తర్వాత సుశీలను నేనే పెళ్ళిచేసుకున్నాను .... ఇప్పుడు ఆమె నాతోనే వుంటోంది!"— అన్నారు తాత గారు....

"అయితే మీ 'షో' 'రాంగ్‌షో' కాదులెండి" అన్నాడు రమణమూర్తి నవ్వేస్తూ!....

●

---

*అక్షరాలీవేళ అగ్ని విరజిమ్మాలి*
*కవిత సితఖడ్గమై కదను తొక్కాలి*

— అదృష్టదీపక్.

---